ప్రభాత
ఉదయం
తెలుగు దినపత్రిక

**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 4 | సంచిక: 136 | పేజీలు: 5 | వెల: రూ.3/- | మంగళవారం 25 ఆగస్టు 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

# గుజరాత్ ఆధిపత్యాన్ని సహించేది లేదు

## కేంద్రంపై రెచ్చిపోయిన రేవంత్




**హైదరాబాద్, ఆగస్టు 24 (ప్రభాత ఉదయం)**

తన విదేశీ పర్యటనపై అన్ని వివరాలు కేంద్ర ప్రభుత్వానికి తెలియజేశామని ఈ మేరకు అప్లికేషన్ పెట్టుకున్నామని అయినా కూడా యూకే పర్యటనకు అనుమతి ఇచ్చి, అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి తిరస్కరించిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. నా పర్యటనకు సంబంధించిన పూర్తి సమాచారం కేంద్రానికి ముందే ఇచ్చామని, విద్య, క్రీడలు, పెట్టుబడుల కోసమే అమెరికా వెళ్తున్నామని చెప్పామని అయినా కేంద్ర ప్రభుత్వం రాజకీయ కారణాలతో నా అమెరికా పర్యటనకు అనుమతి తిరస్కరించిందని మండిపడ్డారు. అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వకపోవడంతో టూర్ రద్దు అయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో యూకే పర్యటన ముగించుకుని ఇవాళ ఉదయం హైదరాబాద్ చేరుకున్న ఆయన తెలంగాణ సచివాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. రాజకీయ కారణాల వల్ల అనుమతి నిరాకరిస్తున్నామని విదేశాంగశాఖ బదులించ్చిందని.. కేంద్రంలో ఉన్న కొందరు బీజేపీ నేతలు కేంద్రాన్ని తప్పుదోవ పట్టించారని అన్నారు. బీజేపీ నేతలు విచక్షణ కోల్పోయి అవస్తవాలను ప్రచారం చేశారని సీఎం పర్యటన దాపరికంగా ఉన్నట్లు విదేశాంగశాఖ మాట్లాడిందన్నారు. యూకే, అమెరికాకు ఒకే విధానంతో వెళ్తున్నామని చెప్పాం. అలాంటప్పుడు యూకే పర్యటకు అనుమతి ఇచ్చి అమెరికాకు ఎందుకు నిరాకరించారో ప్రధాని నరేంద్ర మోడీ సమాధానం చెప్పాలని ప్రశ్నించారు.

**గుజరాత్ సీఎంకు అనుమతి ఇచ్చి నాకెందుకు అభ్యంతరం?**

గుజరాత్ సీఎంకు అమెరికా, కెనడా పర్యటనకు అనుమతి ఇచ్చిన కేంద్రం తన అమెరికా పర్యనటను ఎందుకు అడ్డుకుందని నిలదీశారు. తెలంగాణకు వచ్చే సరికి విదేశీ పర్యటనలు తిరస్కరిస్తారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యా, స్పోర్ట్స్ రంగంలో పెట్టుబడులతో ముందుకు వెళ్లాలన్నది మా ఆలోచనతో ముందుకు వెళ్తుంటే తనను అడ్డుకోవడం అంటే ఇది వ్యక్తిగతంగా రేవంత్ రెడ్డిని అడ్డుకోవడం కాదని నాలుగుకోట్ల మంది తెలంగాణ ప్రజలన అడ్డుకోవడం అని తెలంగాణ ప్రజలను అవమానించడం అన్నారు. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడమేనన్నారు. ఈ తిరస్కరణకు గుజరాతీ ఆధిపత్యమేనని, నరేంద్ర మోడీ ఇప్పటికీ గుజరాత్ సీఎంగా వ్యవహరిస్తున్నారే తప్పా భారత ప్రధానిగా ఆలోచించడం లేదన్నారు. గుజరాత్ ముఖ్యమంత్రిని అమెరికా పర్యటనకు ఎనిమిది రోజుల పాటు అనుమతి ఇచ్చి తెలంగాణ ముఖ్యమంత్రికి మాత్రం రాజకీయ కారణాలతో అనుమతి తిరస్కరించడం రాష్ట్ర ప్రజలను అవమానించడమేనన్నారు.

**కుట్రతోనే అడ్డుకున్నారు..**

ముఖ్యమంత్రి హోదాలో తన పర్యటనను అడ్డుకోవడం చూస్తుంటే తెలంగాణ పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్షను ప్రదర్శిస్తోందని అర్థం అవుతోందని ఈ వివక్షను ఏమాత్రం సహించరానిదన్నారు. తెలంగాణ ..మిగతా 2లో



## సీఎం రేవంత్‌తో
# భట్టి విక్రమార్క భేటీ

**కొండా సుస్మిత, చిన్నారెడ్డిల అంశంపై చర్చ!**

**లండన్ నుంచి హైదరాబాద్ చేరుకున్న సీఎం రేవంత్**

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో సమావేశం**

**తెలంగాణలో జరుగుతున్న తాజా రాజకీయ పరిణామాలపై చర్చించినట్లు సమాచారం**

**హైదరాబాద్, ఆగస్టు 24 (ప్రభాత ఉదయం)**

లండన్ పర్యటన ముగించుకుని హైదరాబాద్ చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డిని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కలిశారు. అమెరికా పర్యటనకు కేంద్రం నిరాకరణ, తాజా రాజకీయ పరిణామాలపై చర్చించినట్లు సమాచారం. వీటితో పాటు కొండా సుస్మిత, చిన్నారెడ్డిల అంశాలపై మాట్లాడినట్లు తెలిసింది. పెట్టుబడులే లక్ష్యంగా 3 రోజుల పాటు లండన్‌లో పర్యటించిన సీఎం విదేశీ పర్యటన విజయవంతంగా ముగించుకుని భారత్‌కు చేరుకున్నారు. ఈ ఉదయం శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌కు చేరుకున్న ముఖ్యమంత్రికి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీగా చేరుకొని ఘన స్వాగతం పలికారు. మద్దతు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ధన్యవాదాలు : రాజకీయ అంశాలపై హైదరాబాద్ వచ్చిన తర్వాత అన్ని మాట్లాడతానని సీఎం రేవంత్ రెడ్డి ఆదివారం ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. మూడ్రోజుల లండన్ పర్యటన ముగించుకున్న సీఎం రేవంత్‌రెడ్డి ఈరోజు ఉదయం హైదరాబాద్‌కు చేరుకున్నారు. అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించిన అంశంపై బలమైన మద్దతు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. దేశ ప్రయోజనాల కోసం ఈ విషయంలో అండగా నిలిచిన పార్టీ, నాయకులు, ప్రజలకు కృతజ్ఞతలు అంటూ ..మిగతా 2లో

## ప్రభుత్వ ఆస్తులు రిజిస్ట్రేషన్ చేయాలని చూస్తే
# సాధ్యం కాదు
## మంత్రి పొంగులేటి




**హైదరాబాద్, ఆగస్టు 24 (ప్రభాత ఉదయం)**

22ఏ భూములకు సంబంధించి రిజిస్ట్రేషన్లు ఆగిన వాటిని 24 గంటల్లో క్లియర్ చేశామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ ఆస్తులు రిజిస్ట్రేషన్ చేయాలని చూస్తే సాధ్యం కాదన్నారు. మేడ్చల్‌లోని భూధాన్ భూముల్లో వాటిని తిరస్కరించామని వెల్లడించారు. స్లాట్లు బుక్ చేసి రిజిస్ట్రేషన్ కాకపోతే వారంలో ఖాతాల్లో జమ చేస్తామన్నారు. ఈనెల 18 నుంచి టోల్‌ఫ్రీ నంబర్‌కు 1162 కాల్స్ వచ్చాయని, వాటిని జిల్లాల వారిగా పంపించినట్లుగా పొంగులేటి తెలిపారు. ప్రైవేటు ఆస్తులవి ..మిగతా 2లో

## ప్రతి వ్యక్తి, ప్రతి ఇంటికి ఒక మొక్క అందించేలా విస్తృతంగా
# వన మహోత్సవ కార్యక్రమాలు చేపట్టాలి

**అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ.**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి,ఆగస్టు 24(ప్రభాత ఉదయం)**




వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 56.46 శాతం మొక్కల పెంపకం పూర్తయిందని ఈ నెల 25న నిర్వహించనున్న ప్రత్యేక వన మహోత్సవ కార్యక్రమం ద్వారా నిర్దేశిత లక్ష్యానికి అదనంగా కనీసం 10 శాతం మేర మొక్కలు నాటేలా అధికారులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని అటవీ, పర్యావరణ మరియు దేవాదాయ శాఖ మంత్రి సూచించారు.వన మహోత్సవం కార్యక్రమం అమలు పై సోమవారం అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి జిల్లా వారీగా మొక్కలు నాటే లక్ష్యాలుఇప్పటి వరకు సాధించిన పురోగతిని సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ నెల 23వ తేదీ నాటికి రంగారెడ్డి జిల్లాలో 78.540 లక్షల మొక్కలు నాటే లక్ష్యానికి గాను 45.287 లక్షల మొక్కలు నాటి 57.66 శాతం సాధన నమోదైనట్లు సమీక్షలో వెల్లడైంది. రాష్ట్రవ్యాప్తంగా 1606.286 లక్షల ..మిగతా 2లో

## అమాత్యుడి అభయహస్తం..
# అవినీతి అధికారి వసూళ్ల పర్వం!

**అంజయ్య నగర్ భవన ప్రమాదంలో వెలుగు చూసిన అక్రమ దందా..**

**నిర్దోషి సెక్షన్ ఆఫీసర్ బలి, అసలు సూత్రధారి సేఫ్!**

**శేరిలింగంపల్లి :ఆగష్టు 24, (ప్రభాత ఉదయం)**

రాజకీయ ప్రాపకం, అమాత్యుడి అభయహస్తం ఉంటే చాలు.. ఎంతటి అక్రమాన్నైనా యథేచ్ఛగా నడిపించవచ్చని నిరూపిస్తున్నారు. ఆ సర్కిల్ ఉన్నతాధికారి! గ్రేటర్ మాదాపూర్ సర్కిల్ పరిధిలో వెలిసే అక్రమ నిర్మాణాలే పెట్టుబడిగా, లక్షల్లో వసూళ్లకు తెరలేపారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల అంజయ్య నగర్‌లో కూలిపోయిన భవన ప్రమాదం వెనుక పెద్ద ఎత్తున 'చేతివాటం' నడిచిందనే ప్రచారం జరుగుతుండగా, అసలు దోషులను వదిలేసి ఏ తప్పూ ఎరుగని ఒక అమాయక సెక్షన్ ఆఫీసర్‌ని బలిపశువును చేయడంపై ఉద్యోగ వర్గాలు, స్థానిక ప్రజలు తీవ్ర అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ




నిర్మాణాలకు వెనుక అమాత్యుడి నీడ అడిగే నాథుడే లేడని అక్రమార్కుల ధీమాగా వ్యవహరిస్తున్నాడని విమర్శలు. రోడ్డు వైడనింగ్ నెపంతో సొంత శాఖ సిబ్బంది పనితీరును కట్టిసి.. కలెక్షన్ల బాట పట్టిన అవినీతి తిమింగలం! "అసలు తిమింగలం ఏజెట్లను పెట్టి దందాలు నడుపుతుంటే.. అమాయక ఉద్యోగిని సస్పెన్షన్ శిక్షా? అని ఉద్యోగులు ప్రజలు ఆగ్రహం. అయ్యప్ప సొసైటీ నుంచి ..మిగతా 2లో



అంజయ్య నగర్‌లో కూలిపోయిన భవనాన్ని సందర్శించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్...

## అనుభవం లేని నిర్మాణాలు..
# ప్రాణాలతో చెలగాటం!

**రెండు ఫ్లోర్ల పునాదిపై ఏడెనిమిది అంతస్తులా? హైడ్రా కమిషనర్ రంగనాథ్ తీవ్ర ఆగ్రహం!**

**మరో 8 ప్రమాదకర భవనాల కూల్చివేతకు సిద్ధం: అంజయ్య నగర్‌పై 'హైడ్రా' ఉక్కుపాదం!**

**అక్రమ నిర్మాణాలపై తగ్గేదే లేదు.. అంజయ్య నగర్ ఘటనపై కమిషనర్ రంగానాథ్ సీరియస్ హెచ్చరిక!**

**శేరిలింగంపల్లి :ఆగష్టు 24,(ప్రభాత ఉదయం)**

నిర్మాణరంగంపై ఎలాటి అనుభవం లేని వారు నిర్మాణాలు చేసి అమాయక కూలీల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని హైడ్రా కమిషనర్ రంగనాథ ఆగ్రహం వ్యక్తం చేశారు. అంజయ్య నగర్‌లో ప్రమాదకర భవనాలను పరిశీలించిన ఆయన కనీస నిర్మాణ అనుభవం, సరైన నాణ్యతా ప్రమాణాలు లేకుండా బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతున్నారని మిషనర్ ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం ..మిగతా 2లో



## హైకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి
# స్వల్ప ఊరట

**హైదరాబాద్, ఆగస్టు 24 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ ప్రభుత్వానికి రాష్ట్ర హైకోర్టులో కీలక ఊరట లభించింది. రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా అమలవుతున్న కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద దివ్యాంగ యువతులకు అందిస్తున్న అదనపు ఆర్థికసాయాన్ని కొనసాగించుకునేందుకు హైకోర్టు పచ్చజెండా ఊపింది. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద సాధారణ లబ్ధిదారులతో పోలిస్తే దివ్యాంగ యువతులకు 25 శాతం అదనంగా ఆర్థికసాయం అందించేలా గతంలో రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ ..మిగతా 2లో

### ప్రతి వ్యక్తి, ప్రతి ఇంటికి ఒక మొక్క అందించేలా విస్తృతంగా

# వన మహోత్సవ కార్యక్రమాలు చేపట్టాలి

**మొదటి పేజీ తరువాయి...**

మొక్కల లక్ష్యానికి గాను 906.853 లక్షల మొక్కలు నాటి 56.46శాతం సాధన నమోదైంది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ నెల 25న నిర్వహించనున్న వన మహోత్సవ కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహించి, "ఒక్క వ్యక్తికి ఒక మొక్క -- ఒక్క ఇంటికి ఒక మొక్క" అనే విధంగా ప్రజల భాగస్వామ్యంతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని విస్తృతం చేయాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు, ఎన్‌సీసీ విద్యార్థులు, ప్రభుత్వ కార్యాలయాల సిబ్బంది, పరిశ్రమల ప్రతినిధులు, అంగన్‌వాడీ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు, గ్రామ ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వీఐపీలు, రైతులు, యువత, సామాజిక సంస్థలు, మీడియా ప్రతినిధులను కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని ఆదేశించారు.

**దేవాలయాల్లో ప్రత్యేకంగా మొక్కలు నాటాలి**

దేవాలయాలకు ప్రత్యేక ప్రాధాన్యత కలిగిన వృక్ష జాతులను గుర్తించి, ఆయా చెట్ల మొక్కలను సేకరించి దేవాలయ ప్రాంగణాల్లో నాటాలని మంత్రి సూచించారు. దీనివల్ల పర్యావరణ పరిరక్షణతో పాటు సంప్రదాయంగా ప్రాధాన్యత కలిగిన వృక్ష జాతులను సంరక్షించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

**ఆరోగ్యకరమైన, నాణ్యమైన మొక్కల పంపిణీ**

అన్ని నర్సరీల్లో తగినంత మొక్కలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలకు ఆరోగ్యకరమైన, నాణ్యమైన మొక్కలను మాత్రమే పంపిణీ చేసి నాటించాలని అధికారులను ఆదేశించారు. మొక్కల సేకరణ, రవాణా, గుంతల ఏర్పాటు, నాటడం, అనంతరం నీటి వసతి కల్పించడం వంటి అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లో అర్బన్ ఫారెస్టులకు ప్రాధాన్యత

పట్టణ ప్రాంతాల్లో పచ్చదనాన్ని పెంచేందుకు అర్బన్ ఫారెస్టుల ఏర్పాటును ప్రోత్సహించాలని మంత్రి సూచించారు. మున్సిపాలిటీల పరిధిలో ప్రజల భాగస్వామ్యంతో పెద్దఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టి పట్టణాల్లో పచ్చదనాన్ని మరింత పెంచాలని ఆదేశించారు.

**చెరువుల పరిసరాల్లో తాటి మొక్కల పెంపకం**

తాటి మొక్కలను చెరువుల పరిసర ప్రాంతాల్లో, అలాగే గౌడ సమాజానికి చెందిన భూముల్లో నాటేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. భూగర్భ జలాల పెంపుపై ప్రత్యేక దృష్టిఈ సీజన్‌లో తక్కువ వర్షపాతం నమోదైన నేపథ్యంలో మొక్కల పెంపకంతో పాటు భూగర్భ జలాల పెంపుపై కూడ ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి తెలిపారు. నీటి సంరక్షణకు అనువైన ప్రాంతాలను గుర్తించి, అక్కడ నీటి నిల్వ , భూగర్భ జలాల పెంపునకు అవసరమైన గుంతలు, ఇతర చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ నెల 25న నిర్వహించనున్న వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జిల్లాలోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, మొక్కల సేకరణ, రవాణా, గుంతల ఏర్పాటు, మొక్కలు నాటడం, నీటి సదుపాయం తదితర ఏర్పాట్లను పూర్తిచేసి కార్యక్రమాన్ని పెద్దఎత్తున విజయవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కే. కిరణ్మయి, జిల్లా అటవీ అధికారి శివ ఆశిష్ సింగ్, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, డిపిఓ సురేష్ మోహన్, పరిశ్రమల శాఖ అధికారి శ్రీలక్ష్మి, డి. ఈ.ఓ వెంకటేశ్వర్లు, వ్యవసాయ శాఖ అధికారి సుజాత, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# అమాత్యుడి అభయహస్తం.. అవినీతి అధికారి వసూళ్ల పర్వం!

**మొదటి పేజీ తరువాయి...**

పీజేఆర్ నగర్ వరకు వసూళ్ల సామ్రాజ్యం!.

సర్కిల్ నూతనంగా ఏర్పడిన తర్వాత, సదరు అమాత్యుడి ప్రత్యేక సిఫార్సులతోనే ఇక్కడ పోస్టింగ్ దక్కించుకున్నారని సర్కిల్‌లో జోరుగా చర్చ నడుస్తోంది. రాజకీయ నాయకుల అండ చూసుకుని విచ్చలవిడిగా వసూళ్లకు తెగబడుతున్నాడని ఆరోపణలు వస్తున్నాయి.

ప్రతీ డివిజన్‌కు ఒక ఏజెంట్‌ను నియమించుకుని వసూళ్ల పర్వాన్ని నడుపుతున్నారని పుకార్లు షికార్లు చేస్తున్నాయి.

అంజయ్య నగర్, సిద్ధిఖ్ నగర్, వడ్డేర బస్తీ, పీజేఆర్ నగర్ తోపాటు సర్కిల్ పరిధిలో ఎస్ఆర్‌పీ మోటరు సైకిల్ పై తిరుగుతూ వసూళ్ల దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది. అయ్యప్ప సొసైటీలో అత్యంత హస్తవాసి ఉన్న ఒక అనుచరుడిని రంగంలోకి దింపి భారీగా వసూలు చేస్తున్నారని సమాచారం.

**స్లాబుకో రేటు.. ప్లాటుకో ధర**

అయ్యప్ప సొసైటీ పరిధిలో స్లాబు వేయాలంటే 2 నుండి 3 లక్షల రూపాయల వరకు వసూలు చేస్తున్నారనే ప్రచారం ఉంది. మిగతా ప్రాంతాల్లో ప్లాట్ సైజు, నిర్మించే అంతస్తులను బట్టి ధర ఖరారు చేసి మరి ముక్కుపిండి మరీ డబ్బులు గుంజుతున్నట్లు వార్తలు వస్తున్నాయి.

**టౌన్ ప్లానింగ్‌కు హుకుం.. వసూళ్లకు ఉచిత ప్రవేశం!**

నిజానికి నగరంలో జరిగే ఎలాంటి అక్రమ నిర్మాణాలనైనా అడ్డుకోవాల్సిన, పర్యవేక్షించాల్సిన బాధ్యత టౌన్ ప్లానింగ్ విభాగంపై ఉంటుంది. కానీ ఈ అవినీతి అధికారి జారీ చేసిన విచిత్రమైన 'హుకుం' సర్కిల్‌లో హాట్ టాపిక్‌గా మారింది. టౌన్ ప్లానింగ్ అధికారులు కేవలం రోడ్డు వెడల్పు పనులు ఆన్‌లైన్ ఫిర్యాదుల పరిష్కారానికే పరిమితం కావాలని ఆదేశించారు. అక్రమ నిర్మాణాల వైపు టౌన్ ప్లానింగ్ సిబ్బంది కన్నెత్తి చూడకుండా కట్టడి చేసి, తన ఏజెంట్ల ద్వారా నేరుగా వసూళ్లు చేసుకునే వెసులుబాటు కల్పించుకున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.

**అమాయకుడి బలి.. ఉద్యోగుల ముక్కున వేలేసుకునే విడ్డూరం!**

ఇటీవల అంజయ్య నగర్‌లో అక్రమంగా నిర్మిస్తున్న భవనం కూలిపోయిన ఘటన తీవ్ర కలకలం రేపింది. అయితే ఈ ఘటనలో అసలు ఆక్రమణలను ప్రోత్సహించిన అధికారిని కాపాడేందుకు, ఈ విషయంతో ఎలాంటి సంబంధం లేని, 'అన్నం పున్నం తెలియని' అమాయక సెక్షన్ ఆఫీసర్ ని సస్పెండ్ చేయడంపై తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. రాజకీయ పలుకుబడి, అమాత్యుడి అభయహస్తం ఉండటంతో సదరు అధికారిపై చర్యలు తీసుకోవడానికి ఉన్నతాధికారులు సైతం వెనకడుగు వేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. తప్పు చేసిన వారిని పక్కన పెట్టి, అమాయక ఉద్యోగిని బలిపశువును చేయడంపై సర్కిల్ సిబ్బందితో పాటు స్థానిక ప్రజలు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ భారీ అవినీతి దందాపై సమగ్ర విచారణ జరిపి, అసలు సూత్రధారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

### అనుభవం లేని నిర్మాణాలు..

# ప్రాణాలతో చెలగాటం!

**మొదటి పేజీ తరువాయి...**

రెండు అంతస్తులకు సరిపడా స్ట్రక్చర్ (పునాది) వేసి, దానిపై ఏడెనిమిది అంతస్తులు నిర్మిస్తుండటం వల్లే ఇటువంటి దారుణ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన విమర్శించారు. గచ్చిబౌలిలోని అంజయ్య నగర్‌లో ఇటీవలే కూలిపోయిన భవన స్థలాన్ని, అలాగే దాని పక్కనే అత్యంత ప్రమాదకరంగా మారిన ఇతర నిర్మాణాలను కమిషనర్ రంగనాథ్ క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలించారు. కూల్చివేత పనులను దగ్గరుండి పర్యవేక్షించిన ఆయన, మీడియాతో మాట్లాడుతూ కీలక విషయాలను వెల్లడించారు. అంజయ్య నగర్ పరిధిలో అత్యంత ప్రమాదకర స్థితిలో ఉన్న మరో 8 అక్రమ భవనాలను గుర్తించామని తెలిపారు. 10 మీటర్లకు పైగా ఎత్తు ఉన్న ఏ క్షణంలోనైనా కూలిపోయే ప్రమాదం ఉన్న భవనాలను త్వరలోనే పూర్తిగా కూల్చివేస్తామని స్పష్టం చేశారు. సిఎంసి అధికారులతో పూర్తి సమన్వయంతో పనిచేస్తూ శేరిలింగంపల్లి పరిధిలో ఉన్న అక్రమంగా నిబంధనలకు విరుద్ధమైన నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నియమాలు ఉల్లంఘించి ప్రజల భద్రతను పణంగా పెట్టే బిల్డర్లపై చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని కమిషనర్ రంగనాథ్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# గుజరాత్ ఆధిపత్యాన్ని సహించేది లేదు

**మొదటి పేజీ తరువాయి...**

బీజేపీ ఎంపీలు గుజరాత్‌ను సపోర్టు చేస్తున్నారా? తెలంగాణ అభివృద్ధి బీజేపీ ఎంపీలకు అవసరం లేదా అని ప్రశ్నించారు. ఇది అంతా ఆషామాషీగా తీసుకునే విషయం కాదని రాష్ట్ర బీజేపీ నేతల మెతక వైఖరి వల్ల తెలంగాణ వ్యతిరేక భావజాలం పార్లమెంట్‌లో పదే పదే మాట్లాడుతున్నారు. ఇప్పుడు తెలంగాణ అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణకు పెట్టుబడులు వస్తే గుజరాత్‌కు పెట్టుబడులు ఆగిపోతాయనే కుట్రతో తన పర్యటనను అడ్డుకున్నారని మండిపడ్డారు. రాజకీయ కారణాలతో అడ్డుకుంటున్నామని చెబుతున్నారు. మోడీది బీజేపీ నాది కాంగ్రెస్, ఆయనది గుజరాత్ నాది తెలంగాణ ఇందులో తెలియని రాజకీయ ఎజెండా ఏంటని ప్రశ్నించారు.

**హైకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి స్వల్ప ఊరట**

తెలంగాణ ప్రభుత్వానికి రాష్ట్ర హైకోర్టులో కీలక ఊరట లభించింది. రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా అమలవుతున్న కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద దివ్యాంగ యువతులకు అందిస్తున్న అదనపు ఆర్థికసాయాన్ని కొనసాగించుకునేందుకు హైకోర్టు పచ్చజెండా ఊపింది.

### హైకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి

# స్వల్ప ఊరట

**మొదటి పేజీ తరువాయి...**

చేసింది. సోమవారం ఈ పథకాల అమలుపై దాఖలైన పిటిషన్లపై హైకోర్టులో విచారణ జరిగింది. విచారణ సందర్భంగా ప్రభుత్వం తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. దివ్యాంగుల హక్కుల చట్టం నిబంధనలకు అనుగుణంగానే ఈ ప్రత్యేక ఆర్థిక సాయాన్ని అందిస్తున్నట్లు ధర్మాసనానికి స్పష్టం చేశారు. ప్రభుత్వ వాదనలతో ఏకీభవించిన ఉన్నత న్యాయస్థానం.. దివ్యాంగులకు ఇచ్చే ఆర్థిక సాయం ప్రక్రియను కొనసాగించేందుకు అనుమతినిచ్చింది. అనంతరం కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై దాఖలైన తదుపరి పిటిషన్ల విచారణను హైకోర్టు రెండు వారాల పాటు వాయిదా వేసింది.

### సీఎం రేవంత్‌తో

# భట్టి విక్రమార్క భేటీ

**మొదటి పేజీ తరువాయి...**

రాసుకొచ్చారు. రాజకీయ కారణాలతోనే ఆపేశారు : లండన్‌లో షెడ్యూలు ప్రకారం సమావేశాలు, కార్యక్రమాలను ముగించినట్లు సీఎం తెలిపారు. ముందస్తు షెడ్యూలు ప్రకారం బోస్టన్‌కు వెళ్లాల్సి ఉండగా కేంద్ర ప్రభుత్వం రాజకీయ కారణాలతో అమెరికా పర్యటనకు పర్మిషన్ ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ నూతన విద్యావిధానంలో భాగంగా ప్రపంచంలోని అత్యుత్తమ సంస్థలను తెలంగాణకు తీసుకురావడమే ఈ పర్యటన ముఖ్య ఉద్దేశమని చెప్పారు. ఐవీలీగ్, ప్రపంచ అత్యున్నత సంస్థల నుంచి విద్య, నైపుణ్యాలు, శిక్షణ పొందాలనే యువత ఆకాంక్షలకు ఈ పర్యటన సమాధానంగా నిలిచేదన్న సీఎం రేవంత్ రెడ్డి దేశ నిర్మాణం, యువత భవిష్యత్తుపై రాజకీయాలకు అతీతంగా ఆలోచించాలని సూచించారు. తెలంగాణ కాంగ్రెస్‌లో నేతల తీరుపై చర్చించి నేడు ఓ నిర్ణయానికి రానున్నట్లు తెలుస్తోంది.

### ప్రభుత్వ ఆస్తులు రిజిస్ట్రేషన్ చేయాలని చూస్తే

# సాధ్యం కాదు

**మొదటి పేజీ తరువాయి...**




కాకుండా ప్రభుత్వ ఆస్తులకు సంబంధించిన సమస్యలే ఎక్కువగా ఉన్నాయన్నారు. ఈ అశంపై ప్రతి సోమవారం ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్నామన్నారు. 22ఏ జాబితాలోనివి, వివిధ ఆర్డర్లలోని ఉన్న వివరాలు అప్‌లోడ్ చేశామని పొంగులేటి తెలిపారు. ప్రభుత్వ ఆస్తులు రిజిస్ట్రేషన్ సాధ్యం కాదు : ప్రభుత్వ ఆస్తులు రిజిస్ట్రేషన్ చేయాలని చూస్తే సాధ్యం కాదని వివరించారు. మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో సీఎస్7,14కు సంబంధించిన వివాదాలు ఉన్నాయని, భూములకు సంబంధించి ప్రభుత్వ, ప్రైవేటు వ్యక్తుల మధ్య వివాదం ఉందన్నారు. సీఎస్ 7, 14కు సంబంధించి గతంలో రేవంత్ రెడ్డి పోరాడారని పొంగులేటి గుర్తుచేశారు. 22ఏకి సంబంధించి రిజిస్ట్రేషన్లు ఆగిన వాటిలో 24 గంటల్లో క్లియర్ చేశామని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఎక్కడైనా ఒకటి రెండు ఆగిపోతే ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అధికారుల సంతకాలు ఫోర్జరీ చేసి రిజిస్టేషన్లు చేయాలని లేఖలు రాస్తున్నారన్నారు. నిందితులను గుర్తించి కేసులు నమోదు చేయాలని ఆదేశించామని ఆయన వెల్లడించారు.

"22ఏ జాబితాలోనివి వివిధ జీవోలు, మెమోల్లో ఉన్న వివరాలు ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేశాం. 98 శాతం స్లాట్‌లు బుక్ చేసుకున్న వారందిరివి రిజిస్ట్రేషన్లు చేయగలిగేవి. 22ఏ పరిధిలోకి రిలాక్సేషన్ చేసిన వాటిని క్లియర్ చేశాం. మేడ్చల్, రంగారెడ్డిలోని కొన్నిచోట్ల దేవాదాయ, భూధాన్ భూముల్లో ఉన్న కారణంగా వాటికి సంబంధించిన వాటిని చేయలేమని రిజెక్ట్ చేయడం జరిగింది. స్లాట్‌లు బుక్ చేసిన వారు చెల్లించిన రిజిస్ట్రేషన్‌లు ఫీజులను వారి ఖాతాలకు జమ చేయడం జరుగుతుంది. భూదాన్‌కు సంబంధించిన భూముల సమస్యల పరిష్కారానికి కొంత సమయం పడుతుంది. వాటికి సంబంధించిన కేసులు న్యాయస్థానాల పరిధిలో ఉన్నాయి. ఆ భూముల ఆసాములు తొందర పడొద్దు, వాటిని పరిష్కరిస్తాం"- పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రెవెన్యూశాఖ మంత్రి

## 22-ఏ, భూ భారతి భూముల విషయంలో బ్రోకర్లను నమ్మి మోసపోవద్దు

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డి**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి,ఆగస్టు24(ప్రభాత ఉదయం)**




రంగారెడ్డి జిల్లాలో 22-ఏ జాబితాలో ఉన్న భూములు, భూ భారతి రికార్డులకు సంబంధించిన భూముల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డి సూచించారు. కొంతమంది మధ్యవర్తులు, బ్రోకర్లు భూముల రికార్డులను సరిచేస్తామని, 22-ఏ జాబితా నుంచి భూములను తొలగిస్తామని, భూ భారతి ద్వారా భూమిపై హక్కులు కల్పిస్తామని చెబుతూ ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు సమాచారం అందుతోందన్నారు. ఇలాంటి వ్యక్తుల మాటలను నమ్మి ప్రజలు మోసపోవద్దని ఆయన స్పష్టం చేశారు. భూమిని కొనుగోలు చేసే ముందు లేదా భూమికి సంబంధించిన ఏదైనా లావాదేవీ నిర్వహించే ముందు సంబంధిత రెవెన్యూ అధికారులను సంప్రదించి సర్వే నంబర్, భూమి స్థితి, 22-ఏ జాబితాలోని వివరాలు, భూ భారతి రికార్డులు, ఇతర చట్టపరమైన అంశాలను అధికారికంగా నిర్ధారించుకోవాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేయిస్తామని చెప్పే మధ్యవర్తులు, బ్రోకర్లను నమ్మి ఎలాంటి డబ్బులు చెల్లించవద్దని అదనపు కలెక్టర్ హెచ్చరించారు. భూములకు సంబంధించిన సమస్యలు లేదా అనుమానాలు ఉన్నట్లయితే సంబంధిత తహసీల్దార్ కార్యాలయం లేదా అధికారిక రెవెన్యూ కార్యాలయాలను సంప్రదించి వివరాలు, స్పష్టత పొందాలని సూచించారు. ప్రజలు భూములకు సంబంధించిన వ్యవహారాల్లో అధికారిక విధానాలను మాత్రమే అనుసరించాలని, మధ్యవర్తులు లేదా బ్రోకర్ల ద్వారా జరిగే అనధికారిక లావాదేవీలకు దూరంగా ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డి కోరారు.

## మహేశ్వరంలో నషా ముక్త భారత్ అభియాన్ పై పీఐబీ వార్తా మీడియా వర్క్ షాప్

**ఆగస్టు 25న జరిగే కార్యక్రమానికి స్థానిక విలేకరులందరికీ ఆహ్వానం**

**హైదరాబాద్, ఆగస్టు 24(ప్రభాత ఉదయం)**

మాదక ద్రవ్యాలు కలిగించే దుష్ప్రభావాలపై ప్రజలను చైతన్యవంతులను చేయడంలో భాగంగా- పత్రికా విలేకరుల అవగాహన కోసం రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలో ఈ నెల 25వ (ఆగస్టు 25, 2026) తేదీన ఒక వర్క్ షాపును నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్- పత్రికా సమాచార కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. మహేశ్వరంలోని ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. మాదక ద్రవ్య రహిత సమాజాన్ని రూపొందించడంలో భాగంగా మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలను ప్రజల్లోకి ఎలా తీసుకుపోవాలన్న అంశంపై విలేకరులకు అవగాహన కల్పిస్తారు. మాదక ద్రవ్యాలు సమాజంపై ఎలాంటి చెడు ప్రభావాన్ని చూపిస్తున్నాయన్న అంశాన్ని ఐపీఎస్ అధికారి శ్రీ కె.నారాయణ రెడ్డి (మహేశ్వరం జోన్ డీసీపీ) విలేకరులకు వివరించడంతోపాటు, ఈ అంశంపై వచ్చే వార్తలకు పత్రికల్లో ఇవ్వాల్సిన ప్రాధాన్యాన్నీ, ఈ సవాలును ఎదుర్కోవడంలో విలేకరులు పోషించాల్సిన పాత్రనూ తెలియజేస్తారు. తెలంగాణలో మాదక ద్రవ్యాల తాజా పరిస్థితి గురించి 'ఈగల్ బృందం' నుంచి వస్తున్న ఓ అధికారి విలేకరులకు వివరిస్తారు. 2026, ఆగస్టు 25వ తేదీ ఉదయం పది గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా కోరుతూ హైదరాబాద్- పీఐబీ విలేకరులందరినీ ఆహ్వానిస్తున్నది. మరిన్ని వివరాల కోసం హైదరాబాద్- పీఐబీ, మీడియా కమ్యూనికేషన్ అధికారి వి గాయత్రి గారిని సంప్రదించవచ్చు. సెల్ నెం: 9052565123.

## పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకోండి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి,ఆగస్టు24(ప్రభాత ఉదయం)**



ప్రభుత్వం 2026 సంవత్సరానికి సంబంధించి వితంతు, ఒంటరి మహిళలు, కల్లు గీత కార్మికులు, చేనేత కార్మికులు, డయాలసిస్, ఫైలేరియా, వికలాంగులు , ఇతర అర్హత కలిగిన వారికి పింఛన్ దరఖాస్తులను స్వీకరిస్తోంది. అర్హులైన వారు తమ సంబంధిత మండల, మున్సిపాలిటీ లేదా జిహెచ్ఎంసి కార్యాలయాల్లో దరఖాస్తులు సమర్పించవలసిందిగా తెలియజేయడమైనది. దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీ: 31 ఆగస్టు 2026. కావున అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ గడువులోగా దరఖాస్తు చేసుకోవలసిందిగా కోరడమైనది. +ఎవీజ (జఖ=జు ఏరియా) పరిధిలో ఉన్నవారు మాత్రమే మీ-సేవ ద్వారా దరఖాస్తులు చేసుకోవలెను మరియు రూరల్ ఏరియా వాళ్ళు సంబంధిత ఎంపీడీవో మండలం లో దరఖాస్తు చేసుకోగలరు. అదేవిధంగా, వికలాంగుల విభాగంలో థలసీమియా, సికిల్ సెల్ అనీమియా, హీమోఫీలియా వంటి రక్త సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న అర్హులను ప్రత్యేక ప్రాధాన్యతతో పరిగణించి, వారి దరఖాస్తులను స్వీకరించి పరిశీలించవలసిందిగా సంబంధిత అధికారులకు తెలియజేశారు.

## ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరిస్తాం

**అదనపు కలెక్టర్లు కిరణ్మయి, చంద్రారెడ్డి**

**ప్రజావాణికి(53)ఫిర్యాదులు**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి,ఆగస్టు 24(ప్రభాత ఉదయం)**



ప్రజావాణిలో ప్రజల నుండి స్వీకరించిన సమస్యలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కరిస్తారని జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) కిరణ్మయి, అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి తెలిపారు సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి (53) ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారుల నుండి సమస్యలను జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) కిరణ్మయి, అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి తో కలిసి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ శాఖ--26, ఇతర శాఖలు --27, మొత్తం 53 దరఖస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శారదా దేవి వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యాన విశ్వవిద్యాలయం, క్యాబ్ ఇంటర్నేషనల్ మధ్య అవగాహన ఒప్పందం

### వైస్ చాన్సలర్ డాక్టర్ డి రాజిరెడ్డి

**బుద్వేల్, ఆగస్టు 24 (ప్రభాత ఉదయం)**

శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వ విద్యాలయం, క్యాబ్ ఇంటర్నేషనల్ సంస్థల మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ దండ రాజిరెడ్డి తెలిపారు. విద్యార్థులకు ఆన్ లైన్ కోర్సులు అందుబాటులో ఉండటం వల్ల ఆయా కోర్సులు పూర్తి చేసుకునే అవకాశం ఉందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వైస్ చాన్సలర్ డాక్టర్ డి రాజిరెడ్డి తెలిపారు. ఈ ఒప్పందం వల్ల పరిశోధన, విస్తరణ, శిక్షణ, సామర్థ్య నిర్మాణం, సాంకేతిక జోడింపు అవగాహన మరింత పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలోనే రైతులు, విస్తరణ అధికారులకు కూడా ఈ ఆన్లైన్ కోర్సులపై అవగాహన కల్పించి అం దుబాటులోకి తేనున్నట్లు తెలిపారు. విద్యార్థుల రెగ్యులర్ కోర్సుల కరికులంలో బాగంగా కూడా ఈ కోర్సులు చేసే అవకాశం



అవగాహన ఒప్పందం కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్, క్యాబ్ ఇంటర్నేషనల్ సంస్థ సభ్యులు

ఉందని తెలిపారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ డాక్టర్ దండ రాజిరెడ్డి మాట్లాడుతూ, సైన్స్ ఆధారిత సమాచారాన్ని మాత్రమే రైతులు నమ్మాలని, సోషల్ మీడియా లో అశాస్త్రీయ సమాచారం ఎక్కువగా ఉందన్నారు. నిపుణులతో చర్చించిన తర్వాత మాత్రమే పంటల సాగులో నిర్ణయాలను రైతులు తీసుకోవాలన్నారు. రియల్ టైమ్ ఆధారంగా ఉన్న డిజిటల్ టూల్స్ మాత్రమే వినియోగించాలని డాక్టర్ రాజిరెడ్డి కోరారు. పర్యావరణ మార్పులు, పెరుగుతున్న చీడ పీడల సమస్య, విచక్షణారహితంగా వాడుతున్న పురుగుల మం దుల నేపథ్యంలో ఆన్ లైన్ ఆఫ్ లైన్ టీచింగ్, హైబ్రిడ్, మోడ్ లో జరగాలన్నారు. ప్రస్తుతం వ్యవసాయాన్ని ప్రభావితం చేస్తున్న ముఖ్య అంశాలైన చీడ పీడల యాజమాన్యం, నేల సారవంతత, విత్తనాలు, బిజినెస్, డిజిటల్ ఫార్మింగ్ వంటి అంశాలపై ఆన్లైన్ కోర్సులు ఉన్నాయని క్యాబ్ ఇం టర్నేషనల్ గ్లోబల్ టీమ్ లీడర్ డాక్టర్ మాళవిక చౌదరి అన్నారు. మూడు ఖండాలు, నలభై ఎనిమిది దేశాలలో క్యాబ్ ఇంటర్నేషనల్ వ్యవస్థ ఉందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ భగవాన్, పరిశోధన సంచాలకులు డాక్టర్ లక్ష్మీ నారాయణ, ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసన్, క్యాబ్ సౌత్ ఇండియా అగ్రికల్చరల్ డిజిటల్ టూల్స్ కో ఆర్డినేటర్ డాక్టర్ మాధురి మంజరి, ప్లానింగ్ అండ్ మానిటరింగ్ సెల్ డైరెక్టర్ డాక్టర్ డి అనితా కుమారి, పాలక మండలి సభ్యులు డాక్టర్ ప్రశాంత్, కన్సల్టెంట్ డాక్టర్ కె వీరాంజనేయులు. టెక్నికల్ అడ్వయిజర్ డాక్టర్ సునందిని. ప్రొఫెసర్లు పాల్గొన్నారు.



# జ్ఞాన విజ్ఞాన గణిత సంస్కృతి మేళా ఘనంగా ప్రారంభం

**రాజేంద్రనగర్,ఆగస్టు24(ప్రభాత ఉదయం)**

శ్రీ సరస్వతీ విద్యాపీఠం తెలంగాణ భాగ్యనగర్ విభాగ్ పరిధిలోని 36 పాఠశాలల భాగ్యనగర్ విభాగ్ స్థాయి జ్ఞాన విజ్ఞాన గణిత సంస్కృతి మేళా-2026ను శివరాంపల్లి శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాల ఆధ్వర్యంలో సోమవారం పాఠశాల ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన ఈ మేళాలో 36 పాఠశాలలకు చెందిన 259 మంది విద్యార్థులు,25 మంది ఉపాధ్యాయులు,20 మంది న్యాయ నిర్ణేతలు,20 మంది ప్రబంధకులు పాల్గొన్నారు. నాలుగో తరగతి నుంచి పదో తరగతి వరకు మూడు స్థాయిల్లో విద్యార్థులు విజ్ఞానశాస్త్రం,గణితం, సంస్కృతికి సంబంధించిన వినూత్న నమూనాలను ప్రదర్శించారు. పాల్ టెక్ ఫౌండేషన్ చైర్మన్ పాల్ రెడ్డి రామ్ రెడ్డి,రాష్ట్ర కార్యదర్శి అనఘ వెంకట లక్ష్మి,విభాగ్ కార్యదర్శి విరివింటి రవీంద్ర శర్మ జ్యోతి ప్రజ్వలన చేసి మేళాను ప్రారంభించారు. కార్యక్రమంలో క్షేత్ర శైక్షణిక్ పర్యవేక్షకులు రావుల సూర్యనారాయణ,విభాగ్ శైక్షణిక్ ప్రముఖ్ కాసోజు భూషణ్ ఆచార్య,శివరాంపల్లి పాఠశాల సమితి అధ్యక్షులు పెండ్యాల చంద్ర మోహన్, కార్యదర్శి గొట్టె అనిల్,వ్యవస్థ ప్రముఖ్ పద్మ రామ్,పర్యవేక్షకులు కే.నరసింహ, నిర్వహణ ప్రముఖ్ సునంద,పాఠశాల కమిటీ సభ్యులు సున్నం నాగరాజు,హారతి చక్రపాణి, ఎం.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి తల్లిదండ్రులు,పూర్వ విద్యార్థులు,శ్రేయోభిలాషులు,వివిధ పాఠశాలల విద్యార్థులు హాజరై ప్రదర్శనలను తిలకించారు.మేళాలో ప్రదర్శించిన నమూనాలు విద్యార్థుల సృజనాత్మకతకు అద్దం పట్టాయని నిర్వాహకులు తెలిపారు.ప్రదర్శనలు ఆగస్టు25న కూడా కొనసాగుతాయని పాఠశాల ప్రధానాచార్యులు ఎం.పద్మ రామ్ తెలిపారు.

# ప్రజా ప్రయోజనాల కోసం ప్రభుత్వ భూములను వినియోగించాలి

### మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్

**కూకట్ పల్లి, ఆగస్టు 24 (ప్రభాత ఉదయం)**



కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు పరిధిలోని ప్రభుత్వ స్థలాల వేలాన్ని తక్షణమే నిలిపివేయాలని మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ అంశంపై కూకట్‌పల్లి కేపీహెచ్‌బీ రమ్య గ్రౌండ్స్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ స్థలాలను వేలం వేసే విషయంలో ప్రభుత్వం పునరాలోచన చేయాలని ఎంపీ ఈటెల రాజేందర్ సూచించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గత ప్రభుత్వాలు ప్రభుత్వ భూములను ప్రైవేట్ సంస్థలకు విక్రయించినా, లీజుకు ఇచ్చినా స్థానిక ప్రజలకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం, పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండే ధరల్లో గృహాలను నిర్మించి అందించడం వంటి ప్రజా ప్రయోజన నిబంధనలను అమలు చేసేవని గుర్తు చేశారు. అలాంటి ప్రజా ప్రయోజన నిబంధనలను పరిగణనలోకి తీసుకోకుండా ప్రభుత్వ భూములను కేవలం ప్రస్తుత ఆర్థిక అవసరాల కోసం విక్రయించడం సరైన విధానం కాదని ఆయన అన్నారు. ప్రభుత్వ భూములు ప్రజలకు తరతరాలుగా ఉపయోగపడే విధంగా ప్రణాళికాబద్ధంగా వినియోగించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కూకట్‌పల్లి వంటి వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో ప్రభుత్వ భూములను పార్కులు, క్రీడా మైదానాలు, సీనియర్ సిటిజన్స్ క్లబ్‌హౌస్‌లు, ప్రజా అవసరాల కోసం కేటాయించాలని ఈటెల రాజేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్న విధంగా కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు పరిధిలోని ప్రభుత్వ స్థలాల వేలాన్ని ప్రభుత్వం తక్షణమే నిలిపివేసి, స్థానిక ప్రజల అవసరాలు, భవిష్యత్ తరాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వ భూములు ప్రజల ఆస్తిగా భావించి, వాటిని ప్రజలకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, కూకట్‌పల్లి ప్రజల దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన బీజేపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



హసన్ నగర్ ఇందిరా నగర్ లో ఓటర్లకు నోటీసులు అందచేస్తున్న బూత్ లెవల్ ఆఫీసర్

# మొదటి రోజు 6,364 మంది ఓటర్లకు నోటీసులు అందజేత: సోలిపేట శ్రీనివాస్ రెడ్డి

**బుద్వేల్, ఆగస్టు 24 (ప్రభాత ఉదయం)**

రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో మ్యాపింగ్ చేసుకోని వారు, పేర్లు తప్పులున్న 6,364 మంది ఓటర్లకు బూత్ లెవల్ ఆఫీసర్లు నోటీసులు అందజేయడం జరిగిం దని రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గం ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి తెలి పారు. నోటీసులు అందుకున్న వారు ఈ నెల 27 నుంచి హియరింగ్ కు వచ్చే విదంగా ఏర్పాట్లు చేశామన్నారు. నోటీసులందుకున్న ఓటర్లు తగిన ధృవ పత్రాలు అందజేసి తమ ఓటు ను పదిలం చేసుకోవాలన్నారు. నోటీసులు అందుకున్న ఓటర్లు వారికి ఇచ్చిన తేదీ, సమయాలలో చెప్పబడిన ప్రాం తానికి వచ్చినట్లయితే అసిస్టెంట్ ఎలక్ట్రోల్ రిటర్నింగ్ ఆఫీసర్లు వారి ధృవ పత్రాలను పరిశీలించి ఓటు ను సరి చేసేలా ధృవీకరిస్తారన్నారు. నోటీసులు అందుకుంటున్న ఓటర్లు 1, 96,570 మంది ఉన్నారన్నారు. వారిలో మ్యాపింగ్ చేసుకోలేని వారు 99.396 మంది ఓటర్లు, పేర్లు తప్పులున్న వారు 96,676 మంది ఉన్నారన్నారు.

**ఫారమ్ - 6 ద్వారా 25 వేలకు పైగా దరఖాస్తు**

రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో కొత్తగా ఓటరు జాబితా లో పేరు నమోదు చేసుకోవడానికి 25వేలకు పైగా కొత్త ఓటర్లు దరఖాస్తు చేసుకున్నారని సోలిపేట శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.




# ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ నూతన ఇంజినీరింగ్ కళాశాల ప్రారంభం

### సాంకేతిక రంగానికి అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలి:కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి

**కూకట్ పల్లి, ఆగస్టు 24 (ప్రభాత ఉదయం)**

బాలానగర్ లోని హిందూ ఇన్స్టిట్యూట్ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో నూతన ఇంజినీరింగ్ కళాశాల ప్రారంభమైంది. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి కళాశాలను ప్రారంభించారు. కార్య క్రమానికి మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్, మాజీ మున్సిపల్ చైర్మన్ హనుమంతరావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వర్ రావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. మారుతున్న సాంకేతిక రంగానికి అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. పరి శ్రమలకు అవసరమైన నైపుణ్యాలను అందించే దిశగా కళాశాల పనిచేయాలని ఆకాంక్షించారు. అవకాశాలను సద్వినియోగం చేసుకుని దేశ అభివృద్ధిలో యువత భాగ స్వాములు కావాలని పిలుపునిచ్చారు.




# ప్రియదర్శిని మహిళా డిగ్రీ కళాశాలలో ర్యాగింగ్ వ్యతిరేక, మహిళా భద్రతా అవగాహన సదస్సు

**గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు24(ప్రభాత ఉదయం)**

ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం 'ర్యాగింగ్ వ్యతిరేకం మరియు మహిళల భద్రత'పై విద్యార్థినులకు సోమవారం షీ టీం ఎస్.ఐ. రాణి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్ఐ రాణి ర్యాగింగ్ వల్ల కలిగే పరిణామాలు, చట్టపరమైన శిక్షలు మరియు మహిళల వ్యక్తిగత రక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సమాజంలో లేదా కళాశాలలో ఎలాంటి వేధింపులు ఎదురైనా భయపడకుండా వెంటనే షీ టీమ్ లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని ఆమె సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎ. మీనాక్షి మాట్లాడుతూ.. విద్యార్థినుల భద్రతకే తమ కళాశాల ప్రథమ ప్రాధాన్యత ఇస్తుందని, ఇక్కడ ర్యాగింగ్ లేదా వేధింపులకు ఎట్టి పరిస్థితుల్లోనూ తావు లేదని స్పష్టం చేశారు. అనంతరం విద్యార్థినులందరిచే ర్యాగింగ్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సి.జి. లక్ష్మీ ప్రసాద్, xూజ కోఆర్డినేటర్ ఎం. దేవుజా, యాంటీ ర్యాగింగ్ కోఆర్డినేటర్ బి. జగన్ మోహన్, ఉమెన్స్ ఎంపవర్‌మెంట్ సెల్ కన్వీనర్ డా. ఎం. సమత, అధ్యాపకులు,విద్యార్థినులు పాల్గొన్నారు.



జనవాసాల మధ్య అక్రమంగా నిర్మిస్తున్న షెడ్డు

# జనవాసాల మధ్య అక్రమంగా నిర్మిస్తున్న షెడ్డు నిర్మాణ పనులపై జిహెచ్ఎంసి అధికారులు చర్యలు తీసుకోవాలి

### బస్తీ వాసుల విజ్ఞప్తి

**రాజేంద్రనగర్, ఆగస్టు24 (ప్రభాత ఉదయం)**

రాజేంద్రనగర్ సర్కిల్ గగన్ పహాడ్ దళిత బస్తీలో జనవాసాల మధ్య అక్రమంగా నిర్మిస్తున్న షెడ్డు నిర్మాణ పనులపై జిహెచ్ఎంసి అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. నివాసాల మధ్య షెడ్డు వేయడానికి పనులు జరుగుతున్నాయని, వాటిని అడ్డుకోవాలని స్థానిక భరత్ యూత్ క్లబ్ సభ్యులు కోరుతున్నారు. నివాసాలకు దగ్గర లో ఉన్న చాలా వరకు పరిశ్రమలను ఇక్కడి నుంచి తొలగించడానికి ఎంతో కష్టపడ్డామని గుర్తు చేస్తున్నారు. తిరిగి నివాసాలకు అనుకుని షెడ్డు వేస్తున్నారని, అందులో పరిశ్రమ ను పెట్టి ప్రజలకు ఇబ్బందులు కలుగచేస్తారని, రాజేంద్రనగర్ సర్కిల్ అధికారులు షెడ్డు వేయకుండ అడ్డుకోవాలన్నారు. షెడ్డు నిర్మాణం చేసి గోదాము గా ఏర్పాటు చేసుకుని భారీ వాహనాలను తీసుకువచ్చి బస్తీ ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా చేస్తారన్నారు. దీనిపై అధికారులు దృష్టి సారించాలని కోరారు.




# గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలి

**గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు24(ప్రభాత ఉదయం)**

గట్టు గ్రామ పంచాయతీలో ఎలాంటి అభివృద్ధి పనులు చేయకుండానే తప్పుడు రికార్డులు సృష్టించి రూ. 22 లక్షల ప్రభుత్వ నిధులను అక్రమంగా స్వాహా చేశారని ఆరోపిస్తూ గట్టు గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు సోమవారం జిల్లా కలెక్టరేట్ లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పాత బిల్లుల పేరిట ప్రస్తుత సర్పంచ్, మాజీ సర్పంచ్ ఇద్దరు కలిసి నకిలీ బిల్లులతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణ జరిపించాలని వార్డు సభ్యులు కోరారు.

# పాగుంట గ్రామంలో అస్తవ్యస్తంగా మారిన పారిశుధ్యం

**గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు24(ప్రభాత ఉదయం)**



కేటిదొడ్డి మండలం పాగుంట గ్రామంలో పారిశుధ్యం పూర్తిగా లోపించి గ్రామం అస్తవ్యస్తంగా మారింది. వీధుల్లో మురుగు నీరు రోడ్లపై పారుతున్న పంచాయతి కార్యదర్శి, మండల నాయకులు కరువయ్యారని గ్రామస్తులు అరోపిస్తున్నారు. పారిశుధ్యకార్మికుడు విధులోకి రాకపోవడంతో చెత్త సేకరణ నిలిచిపోయింది. గ్రామంలో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయి, ఈగలు మరియు దోమల బెడద తీవ్రంగా పెరిగింది. దీనివల్ల గ్రామంలో సీజనల్ వ్యాధులు విజృంభించే ప్రమాదం ఏర్పడిందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



# బిజెపి సీనియర్ నాయకులు సూర్యకాంత రెడ్డిని పరామర్శించిన డి.కె. స్నిగ్ధారెడ్డి

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 24(ప్రభాత ఉదయం)**

కెటి దొడ్డి మండలం ఇర్కి చేడు గ్రామానికి చెందిన బిజెపి సీనియర్ నాయకులు సూర్యకాంత రెడ్డి ఇటీవల ప్రమాదవశాత్తు కాలుకు ఫ్రాక్చర్ అయింది. ఈ విషయం తెలుసుకున్న బిజెవైఎం జిల్లా నాయకురాలు డి.కె. స్నిగ్ధ రెడ్డి సోమవారం వారి నివాసానికి వెళ్ళి పరామర్శించారు.ఈ సందర్భంగా సూర్యకాంత రెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పార్టీ అభివృద్ధికి ఆయన అందిస్తున్న సేవలను కొనియాడారు.ఈ పరామర్శ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్ర రెడ్డి, జిల్లా బిజెవైఎం అధ్యక్షుడు బాబుల్ రెడ్డి, మాజీ బిజెవైఎం జిల్లా అధ్యక్షుడు మిర్జాపురం వెంకటేశ్వర రెడ్డి, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు దాస్, మండల అధ్యక్షుడు శ్రీపాద రెడ్డి, మండల నాయకులు ఎర్ర బీమ్ రెడ్డి, నాగిరెడ్డి, హంపి రెడ్డి, సతీష్ పాల్గొన్నారు.

